# ఎర్రి పెన్నేరు

"మనూరికి పక్కన్నే యీ ఏర్ను ఏ దేవుడు పుట్టిచ్చినాడోగాని ఆ మానుబావునికి రోజూ దండం పెట్టుకుంటావుండాలోయ్" అన్నాడంట సినకొండు ఎంగటపతి, పురానం సదివే ఎంగట కొండారెడ్డితో. ఆయన నగి, "ఏర్ను ఏ దేవుడు పుట్టిస్తాడు మామా? అదే పుట్తాది" అంటే, "దేవుడు పుట్టియ్యకంటే యింత బెమ్మాండమైన ఏరు ఎట్ట పుట్తాది తీవోయ్" అని ఆ ఎంగటపతి నమ్మలేదంట. ఎవరన్నా పుట్టిచ్చినారో, దానికై అదే పుట్నాదో తెల్దుకానీ సెప్పాల్నంటే పెన్నేటికతలు శానా శానా వుండాయి.

ఉత్తప్పుడు ఎర్రి ముండాల, మూగి దానాల వుంటాది పెన్నేరు. నోట్లో ఏలు పెట్నా కొరకదు, కాల్తోతన్నినా కర్సదు అనేట్టుంటాది. ఊర్ని కనిపెట్టుకోని కాపాడ్తా వున్నెట్టా వుంటాది, ఊర్ని నమ్ముకోని పక్కన్నే బతుకుతావున్నెట్టా వుంటాది. ఇట్టాటిది యెప్పుడన్నా నీళ్ళొచ్చినప్పుడు... యెంత మారిపోతాదని ! అప్పుడు సూస్తే, "రోజూ రాత్రీ పగలూ సూస్తా వుండే మనేరేనా యిదీ?" అని యిసిత్రమయితాది. ఎండిపోయిన ఏరూ, నిండిపోయిన ఏరూ అంత ఏరుగా వుంటాది మల్ల ! ఎండిపోయిన ఏర్ను సూస్తా వుంటే, రోజూ యింట్లో అమ్మను సూసినట్టుంటాది. అట్టనే అమ్మ బిడ్డల్ను సూసినట్టు ఏరుగూడా ఊర్జనాన్ని సూస్తా వుంటాది.

యింగా తూరుపుదిక్కున సీకటి యిచ్చని తెల్లార్జామనా, మొబ్బులూ మోడాలూ కమ్మిన సందకాడా కాలిక్కాలికి కొట్టుకొంటా ఆడోళ్ళు కడవల్తీసుకొని నీళ్ళకొస్తారు. యియ్యాలప్పుడు యిట్టా ఏటికి నీళ్ళ కొస్తా వుండామే, అనే అలుకే[1] వుండదు వాళ్ళకు. మనేట్లో మనకు అలుకెందుకూ అనిపిస్తాది వాళ్ళకు. వాళ్ళ కట్టం సుకం కనిపెట్టుకోని వున్నెట్టు, సెప్పుల్లేని వాళ్ళ పాదాలకు నొప్పి తాక్కుండా మెత్తని యిసిక పర్సుకునుంటాది ఏరు. సెలిమల్లో నుంచీ కడవల్లోకి నీళ్ళు దోసిళ్ళతో సల్లుకొనే కొద్దీ "తీసక పోండే తల్లుల్లారా" అని యింగా వూర్తా వుంటాది. యిసిక లోపల్నించీ జాల్లుజాల్లుగా నీళ్ళు వూర్తా రావడం సూస్తే, అమ్మ బిడ్డకు పాలిచ్చినట్టే వుంటాది; సెమటలు కారుస్తా ఆదలా బాదలా వచ్చి నోళ్ళను సూసి, "అయ్యో ! ఎంత వాడి బడ్తా[2] వుండారే" అన్నెట్టు సల్లంగా గాలితోల్తా వాళ్ళ సెమట తుడ్సుతాది.

పసుల పిల్లోళ్ళకూ, పసులకూ ఏట్లో తిరగాల్నంటే బయమే వుండదు. నిక్కరు తొడగని ఉడిబిత్తలోనికీ, యాడాద్దాటని దూడకూ ఏరంతా తెల్చు. ఏ జాల్లో నీళ్ళుండేదీ, ఏ గడ్డన గడ్డుండేదీ తెల్చు. బరువు బండి ఏటి మీద రావాల్సొస్తే, రాత్రిళ్ళయినా సరే యాడ బరువు తగిలేదీ, యాడ అలకనగా వుండేదీ నాగళ్లో కూచ్చొని వుండే మనిషికే కాదు, బరువు గుంజే ఎద్దుకూ తెల్చు.

1) భయం 2) శ్రమపడుతూ

మనిషికీ, గొడ్డుగ్గూడా యింత తెల్చిన ఏరు, నీళ్ళొచ్చినప్పుడు ఎట్టుంటాదో తెల్చునా? 'పెన్నరాకడ పెరుమాళ్ళ కెరుక' అయితే, యింగ దాని పోకడ పెరుమాళ్ళగ్గూడా ఎరుక కాదనాల. నీళ్ళొచ్చినప్పుడు అంత పరాయిదై పోతాది!

ఉత్తప్పుడు మనిసి మీదా పసువు మీదా అంత బెమసూపే ఏరు అప్పుడు ఎంత బెదర గొట్టాదని! "నా బలం ముందు నువ్వెంత, నీ బతుకెంత?" అని 'సవాల్' సేస్తా వున్నెట్టు వుంటాది. అంతదాకా కడుపులో పెట్టుకొని కాపాడ్తా వుండి, అప్పుడు వొక్కసారి ఎగిరి తన్నినట్టుంటాది. నిజమే... ఏట్నిండా యీ వల్ల నుంచీ ఆ వల్లకు గడ్డలు కనపరాకుండా సదరంగా నీళ్ళు పార్తా వుంటే సూసేదానిగ్గూడా యెంతో బాగుంటాది. ఊరి జెనమంతా మిద్దెల మీన్నుంచీ, దేలం పారిగోడ[3] మీన్నుంచీ, కండ్లార్పకుండా సూస్తా వుంటారు. ఎనుముల్ను తోలక పోయి కుప్పాటా, పుల్లాటా ఆడిన్తావులూ, మాపిటేలపూట్ల బలిగుడు ఆడిన్తావులూ, లైట్లు పట్టుకోని పోయి రాత్రిళ్ళు సేపలు పట్టిన్తావులూ.... అన్నీ మునిగిపోయుంటాయి. ఈటన్నిట్నీ వొక్క దెబ్బతో ముంచి పారేసి పార్తా వుండే ఏట్ని సూస్తే, ఏదో బెదురుపుట్టాది.

యిట్టాటిది అబ్బబ్బల[4] తరం నుంచీ అనుబవమే. ఒకసారి ఏరు జవితికట్టెక్కి[5] వచ్చిందంటే, యింగో పారి సార్వ[6] దాటి పలానా యీదిలో యింత లోతు దాంకా వచ్చిందనీ సెప్తా వుంటారు. ఏటి వార్న యిండ్లుండే సాకలోళ్ళూ, ఎర్రమోళ్ళ బయన్నా వాళ్ళూ, రాతి పన్జేసే బూసెన్నా వాళ్ళూ బయపడిపోయి "గంగమ్మ తల్లీ, నీ ఉగ్గరం సాలిచ్చి మమ్మల్ని కాపాడు తల్లీ" అని మొక్కోని నీళ్ళ మీంద దీపాలు యిడ్సిందీ తెల్చు. రాత్రి పూట ఆ దీపాలు నీళ్ళ మీంద పోతా, మునిగిపోతా వుంటే సూడదానికి బాగానూ వుండేది, బయంగానూ వుండేది. ఏ సగిర పొద్దున్నో ఆడోళ్ళూ మొగోళ్ళూ నీళ్ళల్లో కొట్టకపోతా, "కొట్టకపోతావుండామర్రో" అని సావు కేకలు పెడ్తే, ఎవరూ పోల్యాకా, నిద్దర పోల్యాకా బిక్కు బిక్కున మేలుకొనే వున్నిందీ తెల్సు. ఇంగా బాగా ఏటి వార్న వుండే యేయే ఊళ్ళవాళ్ళో కొట్టకపోయినట్టూ, ఇండ్లూ ఎనుములూ, గొర్లూ కొట్టకపోయినట్టూ సెప్పుకోడమూ, పేపర్లల్లో యేయడమూ తెల్చు.

ఇట్టా జరిగినప్పుడంతా యిన్నాళ్ళూ నమ్మిచ్చి, ఒక్కపారి నమ్మలేని పని జేసినట్టు అనిపిస్తాది ఎప్పటికప్పుడు. మల్లా మామూలు పెన్నేరయిపోతే, కుండెడో, కడివెడో నీళ్ళు తెచ్చుకోవాలన్నా సెలిమ తోగి తెచ్చుకోవాల్సిందే. "ఏమే, పెన్నేరా; ఎందుకే అప్పుడట్టా సేసినావు?" అంటే, "ఏమోనబ్బీ, అదే నాకూ తెలకుండా వుండ్లాది. తెలక సేసిన పనికి యేమీ అనుకోవాకండి" అనేట్టుంటాది.

ఎప్పుడూ పార్తా వుండే కిష్టా గోదావర్లు కొంపలు కూల్చినాయన్నా, ఊళ్ళనూడ్చి నాయన్నా ఆచ్చెర్యం లేదు, పైగా వాటి వోదాకు తగినట్టుంటాది. యాదో రొండేండ్లకో మూడేండ్లకో, యాన్నో పైగా వానలు పడి నీళ్ళొచ్చినాయని, పూటో రొందు పూట్లో వుండే ఆ పొంగున్జూసి నువ్వెందుకు యింత ఎగిసి పడ్తివి? అంటే.... "ఎరక్కపోయి ఏర్లన్నీ ఒకటే ననుకొంటి నబ్బీ" అనేట్టుంటాది ఎర్రి పెన్నేరు.

3) దేవాలయం ప్రహరీ గోడ 4) తండ్రి తండ్రుల 5) ఏటిగట్టు 6) ఏట్నుంచీ ఊళ్ళోకి వచ్చే మార్గం